# కాసాని గెలుపుతోనే..

# కాంగ్రెస్‌కు గుణపాఠం

## బీసీ నేతకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ నేతలు ఓర్వలేకపోతున్నారు

## ఐక్యంగా ఉంటే బీసీలదే రాజ్యాధికారమంటున్న బీసీ సంఘాల నేతలు




**రాజకీయ పార్టీలు** బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని బీసీ సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా.. బీసీలకు టికెట్ ఇస్తే కూడా ఓర్వలేకపోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాసాని గెలుపు కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలని, బీసీలంతా ఏకమైతే చేవెళ్లలో కాసాని గెలుపు అసాధ్యం కానే కాదని నేతలు పేర్కొంటున్నారు. బీసీలకు కులహంకార పార్టీలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీసీలు తమ దమ్మేంటో చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్యంగా ఉంటే బీసీలదే రాజ్యాధికారమని ఘంటాపథంగా చెబుతున్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా.. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి తీరుతామని స్పష్టం చేస్తున్నారు. బీసీలు ఐక్యంగా ఉండరు.. అన్న భావనను ఈ ఎన్నికల్లో నిరూపించాలని పిలుపునిస్తున్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కల్పించిన ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బీసీల ఐక్యతపై సమాజానికి ఓ స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇద్దామంటున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) :

### బీసీ నేతను గెలిపించుకుందాం



పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించుకుంటే బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీల్లో ఐక్యత లేకపోవడంతో మన హక్కుల సాధనలో వెనుకబడిపోతున్నాం. గతంలో జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంట్‌కు పంపితే బీసీల గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తారు. చేవెళ్ల గడ్డపై బీసీ నేతకు వచ్చిన అవకాశాన్ని మనమంతా వినియోగించుకుని పార్టీలకతీతంగా కాసానిని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రాపోలు నర్సింహులు, ప్రజా చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షుడు

### కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం



ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా బరిలో నిలిచిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను పట్టించుకోవడంలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం సీట్లు బీసీలకు కేటాయించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ధన్యవాదాలు. చేవెళ్ల స్థానాన్ని బీసీ నేత కాసానికి కేటాయించడంపై బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దమ్ముంటే కాసానిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓ నాయకుడు విసిరిన సవాల్‌ను బీసీలందరూ గమనించి మన ఓట్లు మన బీసీ నేతకు వేసి భారీ మెజార్టీతో ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను గెలిపిద్దాం.

- పి. అంజయ్య, బీసీ నేత, షాబాద్ మండలం

### బీసీలందరం ఏకం కావాలి



బీసీలందరం ఐక్యంగా ఉండి బీసీ గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. సమిష్టిగా కృషి చేసి మన నాయకున్ని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీలు మాత్రం అందుకు భిన్నంగా అగ్రకులాలకు చెందిన వారికి టికెట్లు కేటాయించాయి. ఉమ్మడి రంగారెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు కాసాని బీసీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. బీసీలు రాజకీయాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాల్సిన అవసరం వచ్చింది.

- ప్రభాకర్, వికారాబాద్

### బీసీల కోసం పని చేసే నాయకుడిని గెలిపించుకోవాలి



ఎన్నో ఏండ్లుగా బీసీలు ఓటు బ్యాంకుగా మారడమే తప్పా రాజకీయాల్లో రాణించేందుకు అవకాశాలు రాలేదు. ఈసారి చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా బీసీ బిడ్డ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌కు అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి. బీసీలపై కొందరు నాయకులు చిన్న చూపు చూస్తున్నారు. జనాభాలో బీసీల సంఖ్య ఎక్కువగా ఉన్నది.

- మల్లేశ్‌యాదవ్, మదన్‌పల్లి, వికారాబాద్

### మన ఓట్లు మనమే వేసుకుందాం



ఇంత కాలం బీసీలను ఓట్లు కాసే చెట్లుగా మల్చుకున్నారు. బీసీల్లో చైతన్యం వచ్చింది. మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకొని తీరుతాం. బీసీల కులాల ఐక్యత కోసం సంవత్సరాల తరబడి పోరాటం చేసిన నేత కాసాని. అలాంటి వ్యక్తి ఏ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ బరిలో ఉన్నాడనేది ముఖ్యం కాదు. బీసీ నేతగా గెలిపించుకునే బాధ్యత ప్రతి బీసీ బిడ్డపై ఉంది. బీసీని గెలిపించుకొని బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం.

- చిన్నపాక విఘ్నేశ్వర్‌యాదవ్, బడంగ్‌పేట

### బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది



అధికారం సాధించుకోవడానికి బీసీలు ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైంది. చీలికలు పేలికలుగా బీసీలు విడిపోయి ఉంటే బీసీలకు ఎప్పుడూ అధికారం రాదు. అధికారంలోకి రావాలంటే చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాలి. బీసీలు అమ్ముడు పోతారని, బీసీల్లో ఐక్యతలేదని, వారు ఎప్పుడూ ఒక్కటిగా ఉండలేరన్న వాదనకు తెరపడాలంటే కాసానిని గెలిపించుకుందాం. 93 బీసీల కులాల ఐక్య వేదిక అధ్యక్షులుగా జ్ఞానేశ్వర్ ఎంతో సేవ చేశారు.

- ఆంజనేయులు, రజక సంఘం నాయకుడు, బడంగ్‌పేట

### మా సత్తాను చాటుతాం



బీసీలలో ఐక్యతపై కాంగ్రెస్ పార్టీ నేత వ్యాఖ్యలు ఏమాత్రం సరికాదు. రాజ్యాధికారం కోసం ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటుతాం. మా శక్తేంటో నిరూపిస్తాం. ఇప్పటికే బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు ఆయా రాజకీయ పక్షాలు వాడుతున్నాయి. చేవెళ్ల పార్లమెంటు స్థానాన్ని మాజీ సీఎం కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తమ చిత్తశుద్ధిని చాటుకున్నది. అందరం కలిసికట్టుగా బీసీ అభ్యర్థిని గెలిపించుకుని మా ఐక్యతను సమాజానికి చాటుతాం.

- కోట కుమార్‌యాదవ్, యాదవ సంఘం నేత, మియాపూర్

### పార్టీలకతీతంగా ఒక్కటవుతాం



పార్లమెంటు ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీలమంతా ఒక్కటవుతాం. చేవెళ్ల నియోజకవర్గంలో బీసీ వర్గానికి చెందిన అభ్యర్థి కాసానిని ముక్తకంఠంతో ఒక్కటై అధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. దీంతో కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను మా ఐక్యతతో తప్పని నిరూపిస్తాం. బీసీ వర్గాలంతా ఇప్పటికైనా ఆయా రాజకీయ పక్షాలు ఓట్ల జిమ్మిక్కులను గుర్తించాలి. బీసీల కోసం పాటుపడే పార్టీలను, నేతలను గుర్తించి వారికి అండగా నిలవాలి. బీసీలంతా ఐక్యమైనపుడే మరింత మందికి మున్ముందూ అవకాశాలు వస్తాయి.

- వేముల రాజుసాగర్, ఉప్పరి సంఘం నేత, మియాపూర్

### కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం



రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా చేవెళ్ల నియోజకవర్గం నుంచి బీసీ ముద్దుబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. కొన్నేండ్ల నుంచి రాజకీయపరంగా బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు. అలాంటి రాజకీయ నాయకులకు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుతో గుణపాఠం నేర్పుతాం. బీసీల ఐక్యతను చాటితీరుతాం. పార్లమెంట్‌లో బీసీల తరపున గొంతు అయ్యే అవకాశాన్ని కాసానికి ఇవ్వాలి.

- తలారి వీరప్ప, గాజీపూర్, పెద్దేముల్


### బీసీలంతా ఏకం కావాలి



బీసీలందరం ఏకతాటిపైకి వచ్చి రానున్న ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం. అప్పుడే బీసీల ఐక్యత సమాజానికి చాటినట్లు అవుతుంది. ఇలాంటి అవకాశం మళ్లీ రాదు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీ వర్గానికి పెద్దపీట వేసి బీసీలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బీసీల సత్తాను చాటేందుకు ప్రతి బీసీ బిడ్డ ఓ సైనికుడై బీసీ నాయకుడి గెలుపునకు కృషి చేయాలి.

- కె.లాలూయాదవ్, గాజీపూర్, పెద్దేముల్

### బీసీ నాయకుడికి పట్టం కడుతాం



చేవెళ్ల గడ్డపై ఎంపీ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి పట్టం కడుతాం. సంవత్సరాల నుంచి బీసీలకు బీఆర్‌ఎస్ పార్టీ అవకాశం ఇచ్చింది. బీసీల జనాభాలో బీసీలే ఎక్కువగా ఉన్నా బీసీలకు రావాల్సిన పథకాలు ప్రభుత్వాలు అందించడంలేదు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేస్తాం. బీసీలతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది.

- నర్సింహ, లింగంపల్లి, కులకచర్ల

### పార్లమెంటులో బీసీల గళం విప్పాలంటే..



పార్లమెంటులో బీసీల గళం విప్పేందుకు బీసీల నుంచే ఎంపీగా పార్లమెంటుకు పంపించాలి. చేవెళ్ల నుంచి చాలా సంవత్సరాల తరువాత బీసీ నేతకు అవకాశం వచ్చింది. దీన్ని బీసీలందరం ఐక్యంతో ఉండి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. చేవెళ్ల గడ్డపై బీసీ అభ్యర్థికి పట్టం కట్టేందుకు ప్రతి బీసీ ముందుకు రావాలి.

- బోయిని మొగులయ్య, అంతారం, కులకచర్ల

### సర్ చెప్పినవారికే మా ఓటు



రాష్ట్రాన్ని సాధించారు. నీళ్లు తెచ్చారు. అందుకే కేసీఆర్ సర్ చెప్పినవారికే మా ఓటేస్తాం. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌కే మా ఓటు. కొందరికి అర్థంకాక మోసపోయి కాంగ్రెస్‌కు ఓటు వేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఐదు నెలలైనప్పటికీ మాయ మాటలే చెబుతున్నారు. మాలాంటి పేద వారికి ఇప్పటికీ ఎలాంటి సహాయం చేయలేదు.

- రామనర్సయ్య, అడ్డా కూలీ, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్

### ఇప్పటికీ ఎలాంటి పథకాలందలేదు



కాంగ్రెస్ పాలనలో ఇప్పటికీ సామాన్యులకు ఎలాంటి పథకాలందలేదు. గ్యాస్ సిలిండర్ ధర రూ.500 చేస్తామన్నారు. అమలులోకి రాలేదు. మాయ మాటలు చెప్పే నేతలను ఎప్పటికీ నమ్మలేము. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే షాదీముబారక్ లబ్ధిపొందాం. సులేమాన్‌నగర్ కాలనీలో తాగు నీటి సమస్య గత ఎనిమిదేండ్లో ఎప్పుడూ లేకుండేది. ఇప్పుడు మళ్లీ నీటి కష్టాలు వచ్చేశాయి. కాసానికే ఓటు వేస్తాం.

- షేక్ ఇస్మాయిల్, సులేమాన్‌నగర్, రాజేంద్రనగర్

## తాగునీటి సరఫరాపై సమాచారం సేకరించాలి



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ వంశీకృష్ణ

మియాపూర్ , ఏప్రిల్ 18 : వేసవిలో తాగునీటి సరఫరా, ప్రజల ఇబ్బందులపై పూర్తి స్థాయి సమాచారం సేకరించి నివేదించాలని చందానగర్ డీసీ వంశీకృష్ణ పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని ప్రతి కాలనీ సంక్షేమ సంఘం నుంచి నిర్ధారిత ఫార్మాట్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సర్కిల్ పరిధిలోని తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో డీసీ గురువారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. సర్కిల్ వ్యాప్తంగా 168 కాలనీ సంక్షేమ సంఘాలు ఉన్నాయని, వారితో మాట్లాడి ఎప్పటికపుడు నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కార్తిక్, ఎస్ఎస్ శ్రీనివాస్, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

### • శుభాకాంక్షలు



సిటీబ్యూరో, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ జోన్‌కు జోనల్ మేనేజర్‌గా పదోన్నతి పొందిన పునీత్‌కుమార్‌ను గురువారం భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సంఘం గౌరవాధ్యక్షుడు పీ. సంపత్‌రావు, అధ్యక్షుడు ఫణీంద్రకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

### చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు

దుండిగల్, మియాపూర్ , ఏప్రిల్ 18 : హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు అలుగును గురువారం నిజాంపేట డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్, కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు పరిశీలించారు. పరిసర కాలనీల నుంచి అంబీర్ చెరువులోకి మురుగు నీరు చేరుతుండటం వలన దుర్వాసన,దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. నీరు కలుషితం కాకుండా డైవర్షన్ పైప్‌లైన్ల ద్వారా డ్రైనేజీలకు నీటిని మళ్లిస్తామని కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. అలుగులో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్రామయ్య, బాలాజీనాయక్‌తోపాటు నవీన్, బ్రహ్మం, సతీశ్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

ఫొటో రైటప్: 18 ఎంవైపీ 2: ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్‌కు చెందిన కొత్తపల్లి యాదగిరి పేద విద్యార్థులకు పాఠశాల ఫీజుల నిమిత్తం డీవీజీ ట్రస్టు ద్వారా రూ. 40 వేల ఆర్థిక సాయం అందజేశారు. గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, యువనేత రామకృష్ణ గౌడ్ సమక్షంలో ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, పోశెట్టి, యాదగిరి, సంగమేశ్, వాసు, నగేశ్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.









## రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుందాం..

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ జెండా ఎగరేయాలని పిలుపు



గాజులరామారం డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

దుండిగల్, ఏప్రిల్ 18 : ప్రజాసేవ చేసే నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా గురువారం గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, బేకరీ గడ్డ, ఎన్టీఆర్ నగర్‌లో ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు, నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులతో సంబంధం లేకుండా లక్ష్మారెడ్డి గత 20 ఏండ్లుగా ఎన్నో సామాజిక, సేవా, ఉపాధి కార్యక్రమాలతో నిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నాడని, ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపిస్తే బస్తీలు,కాలనీలు అభివృద్ధి చెందుతాయన్నారు. బీజేపీ,కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఇక్కడి వారు కానందున ప్రజాసమస్యలు వారికి తెలియవని, ఇంకెలా వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుకై నిలిచేందుకు మల్కాజ్‌గిరి ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, బీఆర్‌ఎస్ నేతలు విజయరామ్‌రెడ్డి,కస్తూరి బాల్‌రాజ్,అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇబ్రహీం, వెంకటేశ్, మల్లేశ్, అగ్రాస్ మహేశ్, సుజాత, సతీష్‌గౌడ్, మహేశ్, మల్లారెడ్డి, ఎన్టీఆర్ నగర్‌వాసులు దూలప్ప,శివకుమార్,నర్సింగ్ యాదవ్, కృష్ణ,శివారెడ్డి,వీరాచారి, మౌలానా, ఖలీల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి

- అగ్నిమాపక శాఖ డైరెక్టర్ డీజీ నాగిరెడ్డి



బిల్డర్లు, అధికారుల అవగాహన సమావేశంలో డీజీ నాగిరెడ్డి, తదితరులు

కొండాపూర్, ఏప్రిల్ 18 : గచ్చిబౌలిలోని డీఎల్ఎఫ్ భవనంలో గురువారం మాదాపూర్ అగ్నిమాపక అధికారులు ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక శాఖ డైరెక్టర్ డీజీ నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిప్రమాదాలపై హైదరాబాద్ బిల్డర్స్, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్లతో అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారులు,సిబ్బంది, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ముందు జాగ్రత్తలతోనే అగ్నిప్రమాదాల నివారణ**

కేపీహెచ్‌బీ కాలనీ : అగ్ని ప్రమాదాలను నివారణకు ముందు జాగ్రత్తలే మేలని కూకట్‌పల్లి ఏడీఎఫ్ఓ వై.సైదులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్, ఐడీఏ కూకట్‌పల్లి పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. పరిశ్రమల్లో అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్మికులకు అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే విధానాలను మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఫైర్ ఆఫీసర్ జగన్మోహన్, ఫైర్‌సిబ్బంది పాల్గొన్నారు.

**గాజులరామారం డివిజన్‌లో..**

దుండిగల్ : అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం గాజులరామారం డివిజన్‌లోని సిద్ధార్థ భారత్ గ్యాస్ గోదాము సిబ్బందికి కూకట్‌పల్లి ఏడీఎఫ్ఓ సైదులు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.


IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE CUM ADDITIONAL METROPOLITAN SESSIONS JUDGE AT: L.B.NAGAR, RANGA REDDY DISTRICT

I.A. No. 866 of 2022 In O.S.No.1552 of 2022

**Between:**
Katna @ Alli Sumithra Devi & another. ... Plaintiffs
AND
Alli Mallaiah & Others ..Defendants

**NOTICE / SUMMONS**

D6. T.Venkata Shiva Reddy S/o T. Thirumala Reddy Aged about 63 years, Occupation: Business R/o D.No.540, Vivekananda Nagar Colony. Kukatpally, Hyderabad

Please take notice/Summons that the above named plaintiffs have filed the above suit for partition and separate possession. As per the direction of the Hon'ble court the plaintiffs are publishing the notice in I.A. No. 866 of 2022 in O.S. No.1552 of 2022 and it is posted on 03-05-2024 for your appearance.

Therefore, make it convenient to present yourself either in person or through an advocate before Hon'ble IX Additional District Judge Cum Additional Metropolitan Sessions Judge's Court at LB Nagar at 10.30 am failing which the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)
T. VENKATESHWAR RAO, Advocate
Plot # 9, Second Floor, Brindavan Colony, Bandlaguda Jagir Hyderabad.
Mobile: 9703981344
(COUNSEL FOR THE PLAINTIFFS)


## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 18 : అనారోగ్యం, మానసిక సమస్యలతో ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. విజయనగర్‌కాలనీకి చెందిన శ్రీదేవి మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో కుమార్తె వైష్ణవి(20)తో కలిసి ఉంటోంది.తండ్రి చనిపోయిన తర్వాత వైష్ణవి తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. ఇంజినీరింగ్ చదువుతున్న ఆ యువతి తరచూ తలనొప్పితో బాధపడుతూ చికిత్సపొందుతున్నది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. స్థానికుల సాయంతో తల్లి తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే మృతిచెందిందింది. ఈ ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. రక్షించిన పోలీసులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 18 : కుటుంబ కలహాలతో క్వారీలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని పేట్ బషీరాబాద్ పోలీసులు రక్షించారు. ఈ సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లికి చెందిన ఏ. నాగేశ్(34) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై కొంపల్లి జయభేరి క్వారీలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గుర్తించి 100కు సమాచారం ఇవ్వడంతో పేట్‌బషీరాబాద్ పెట్రోలింగ్ పోలీసులు చేరుకుని బాధితుడిని క్వారీలో నుంచి బయటకు తీసుకువచ్చి కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

## కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట, ఏప్రిల్18: కుటుంబ సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మూసాపేట జనతానగర్‌కు చెందిన హరిశంకర్(34) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో సూపర్ వాస్మల్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## బౌరంపేట్‌లో నామమాత్రంగా అక్రమ నిర్మాణాల కూల్చివేత

**అధికారుల తీరుపై స్థానికుల విస్మయం**

దుండిగల్, ఏప్రిల్ 18 : అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ భవనం కూల్చివేతల్లో అధికారులు నామమాత్రంగా వ్యవహరించడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్‌లోని గ్రామకంఠానికి చెందిన 1800 గజాల భూమిలో కొందరు అనుమతి లేకుండా భారీ భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో సదరు నిర్మాణాన్ని తొలగించాలని దుండిగల్ మున్సిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మున్సిపల్,రెవెన్యూ అధికారులు భవన నిర్మాణానికి సంబంధించి కూల్చివేతలు చేపట్టారు. ఇప్పటికే మూడు అంతస్తుల స్లాబ్ నిర్మాణాన్ని చేపట్టగా పక్కనే ఉన్న ఫిల్లర్లను మాత్రమే తొలగించి వెళ్లిపోయారు. దీనిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కూల్చివేతలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.